

# సంగారెడ్డి మెదక్

సోమవారం 12 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:05

## దుర్గామాత ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

- ఎస్ఐ రవి గౌడ్



**కల్హేర్, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
దుర్గామాత ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి కమిటీ పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కల్హేర్ ఎస్ఐ రవి గౌడ్ సూచించారు. మిగతా 2 లో

# హుగ్గెల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

### - మఠం వద్ద నూతన బోరు మోటార్‌ను ఏర్పాటు చేయించిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి





**జహీరాబాద్, అక్టోబర్ 11(ప్రజా జ్యోతి న్యూస్)**
మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలోని స్థానిక మఠం సమీపంలో ఉన్న బోరుబావికి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో నూతన విద్యుత్ మోటార్‌ను అమర్చారు.గత కొద్దిరోజులుగా బోరు మోటార్ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్, వెంటనే స్పందించి కొత్త మోటార్‌ను ఏర్పాటు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. మిగతా 2 లో





# కోహిర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పోచారం అశోక్ ఏకగ్రీవ ఎన్నిక....!

**జహీరాబాద్, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి న్యూస్)**
సంగారెడ్డి జిల్లా,జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక ఆదివారం ఉత్సాహ భరిత వాతా వరణంలో ముగిసింది. వెంకటా పూర్ గ్రామ సర్పంచ్ పోచారం అశోక్ మండల సర్పంచ్‌ల ఫోరం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. మండలం లోని సర్పంచ్‌లందరూ ఏకాభి ప్రాయంతో ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు.ఈ సందర్భంగా వెంకటా పూర్ సర్పంచ్ అశోక్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో తోటి సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు మరియు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మిగతా 2 లో

# కరెంటు కోతలు సృష్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

హత్నూర 11అక్టోబర్ (ప్రజాజ్యోతి)



ఎడాపెడా కరెంటు కోతలు సృష్టిస్తూ రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం భీమ్లాతండా దేవుని గుట్ట తండా శివారులో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతుండటాన్ని పరిశీలించి రైతుల బాధలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నుండి రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేక దాటవేసే దోరని అవలం బిస్తుందని మండిపడ్డారు. రైతులు సాగుచేసిన పంట పొలాలు కరెంటు కోతలు,లో వోల్టేజీతో ఎండిపోతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కరెంటు కోసం రైతన్నలు రోడ్డు ఎక్కుతున్నప్పటికీ చీమకుట్టినట్టు కూడా ప్రభుత్వానికి కావడం లేదని ఆరోపించారు. కండ్ల ముందు పంటలు ఎండిపోతుంటే ఏమి చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో రాష్ట్ర ప్రజలు నేడు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విత్తనాలు కొనుగోలు నుండి మందుల వరకు యాప్ల పేరుతో ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం నేడు చేతికి వచ్చిన పంటను పండించుకుంటున్న తరుణంలో కరెంటు కోతలు సృష్టిస్తూ రైతులను అప్పుల ఊబిలోకి నెట్టుతుందని ఆరోపించారు.కాంగ్రెస్ అంటేనే కరెంటు కోతలు అనే నానుడిని మరొకసారి ప్రభుత్వం నిరూపించుకుందని గుర్తు చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని ఇచ్చే కరెంటును సక్రమంగా ఇచ్చి పంటలు కాపాడాలని కోరారు.

# కోహిర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పోచారం అశోక్ ఏకగ్రీవ ఎన్నిక....!

మొదటిపేజీ తరువాయి

మండల అభివృద్ధికి, సర్పంచ్‌ల సమస్యల పరిష్కా రానికి ఆయన అంకితభావంతో పని చేస్తారని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. మిత్రులు, శ్రేయోభిలాషులు అశోక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన అశోక్ మాట్లాడుతూ, కోహిర్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, సర్పంచ్‌ల ఐక్యతను మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.సర్పంచ్ ల మండల ఫోరం అధ్యక్షులుగా అశోక్ ను ఎన్నుకొన్న సర్పంచ్ లు బిలాల్ పూర్ సర్పంచ్ స్వర్ణకళ అశోక్, దిగ్వాల్ సర్పంచ్ అహమ్మద్ అలీ, బడంపేట్ సర్పంచ్ దయానంద్, చింతల్ ఘాట్ సర్పంచ్ విద్యాసాగర్, గొట్టిగార్ పల్లి సర్పంచ్ రాథోడ్ విశ్వనాథ్, కవేలి సర్పంచ్ సయ్యద్ నాజియా, మద్రి సర్పంచ్ వసంత, నాగిరెడ్డి పల్లి సర్పంచ్ రాజేశ్వరి, పర్శపల్లి సర్పంచ్ బిచ్చన్న, పోతిరెడ్డి పల్లి సర్పంచ్ నర్సమ్మ, రాజనెల్లి సర్పంచ్ అమృతప్ప, సిద్దా పూర్ సర్పంచ్ చావాన్ రమేష్, పిచర్యాగడి సర్పంచ్ అమృత విరారెడ్డి చరవాణి లో చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు ఏకగ్రీవ తీర్మానం చేసి మండల ఫోరం అధ్యక్షు లుగా వెంకటా పూర్ సర్పంచ్ అశోక్ ను ఎన్నుకొన్నారు.

# దుర్గామాత ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి




మొదటిపేజీ తరువాయి

కల్హేర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.విగ్రహాల ఆగమనం నుంచి నిమజ్జనం వరకు డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులకు కమిటీ సభ్యులు సహకరించాలని ఎస్ఐ రవి గౌడ్ కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# హుగ్గెల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యం. గ్రామంలోని ప్రతి కాలనీ, వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం. రాబోయే రోజుల్లోనూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు నిరంతరం అందు బాటులో ఉంటామని పేర్కొన్నారు. సకాలంలో స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించి నందుకుగాను గ్రామ ప్రజలు సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# పండుగ వేళ చిన్న నిర్లక్ష్యం.. పెద్ద నష్టం

## - పండుగ పూట ప్రశాంతతే లక్ష్యం.. ప్రజల అప్రమత్తతే పోలీసులకు సహకారం

## - పండుగకు ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త..

## - ప్రజలకు డీఎస్పీ నరేందర్ గౌడ్ కీలక సూచనలు

**తూప్రాన్,(ప్రజాజ్యోతి) అక్టోబర్ 11:**

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లే సమయంలో, షాపింగ్‌కు బయటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. పండుగల సమయంలో దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆయన మీడియా సమావేశంలో తెలిపారు.పండుగల సందర్భంగా చాలామంది కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు వెళ్తుంటారని, మరికొందరు షాపింగ్‌లు, ఇతర పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్తారని, ఈ సమయంలో ఇంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసివేసి, పటిష్టమైన తాళాలు వేయాలని, వీలైతే ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు గమనించేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

**ప్రయాణాల్లోనూ జాగ్రత్తలు తప్పనిసరి**

బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించే సమయంలో తమ బ్యాగులు, నగదు, బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు వంటి విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రద్దీగా ఉండే మార్కెట్లు, షాపింగ్ కేంద్రాలు, బస్టాండ్లలో గుర్తుతెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా ఉంచకూడదని, ప్రయాణ సమయంలో తమ వస్తువులను తామే జాగ్రత్తగా చూసుకోవాలని పేర్కొన్నారు.ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు వంటి విలువైన వస్తువులను వీలైనంత వరకు సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని, ఇంటికి తాళం వేసి వెళ్లే విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

**ప్రజల అప్రమత్తతే భద్రతకు తొలి మెట్టు**

పండుగలను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవడంతో పాటు వ్యక్తిగత, కుటుంబ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఇబ్బందులకు



దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా పండుగలు జరుపుకోవాలని ఆయన కోరారు.

# కొలిక్కి వచ్చిన చిన్న ఘనపూర్ సొసైటీ నిధుల లెక్క...

**కొల్చారం, అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)**

కొల్చారంమండల పరిధిలోని చిన్న ఘనపూర్ సొసైటీలో రూ. 8 లక్షల 18 వేల నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలు కొలిక్కివచ్చాయి. ఆదివారం సొసైటీ పాలక వర్గం సభ్యులు ఆదివారం మహాజన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నిధుల ఖర్చుకు సంబంధించిన తీర్మాన రికార్డులు వెలికి తీయాలని ప్రజలు డిమాండ్ చేశారు. అనంతరం సొసైటీ బీరువాను పోదా చేయగా అందులో అన్ని రికార్డులు బయట పడ్డాయి. రికార్డులను పరిశీలించగా సొసైటీకి సంబంధించిన ఫర్నిచర్, సి సి కెమెరాలు, ఇన్వర్టర్ వంటి వస్తువులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో రైతులు సైతం సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా సదరు కొనుగోళ్లకు చెందిన బిల్లులను సమర్పించి, ఆడిట్ చేయించి నిధుల లెక్కలు సరిచూడాలని మహాజన సభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మంద నాగయ్య సీఈఓ సత్యనారాయణ రెడ్డి, మాజీ చైర్మన్ రంగారెడ్డి, నరేందర్ రెడ్డి, కిషన్ రెడ్డి, పుల్లబోయిన మల్లేశం, శంకర్, సత్యం, రైతులుతదితరులు పాల్గొన్నారు.






# శ్రీ దుర్గా భవాని కిరాణం జనరల్ స్టోర్....

## - ప్రారంభించిన నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి.....





**కొల్చారం,అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)**

మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా భవాని కిరాణం జనరల్ స్టోర్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దుకాణాన్ని ప్రారంభించారు.తుక్కాపూర్ వార్డు సభ్యుడు, కొల్చారం మండల ఎన్ఎస్‌యూఐ యువజన అధ్యక్షుడు నవీన్ ఏర్పాటు చేసిన ఈ దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఆశీస్సులతో కిరాణం జనరల్ స్టోర్ మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వ్యాపారం విజయవంతంగా సాగుతూ యజమానికి మంచి పేరు, ఆర్థికంగా అభివృద్ధి చేకూర్చాలని కోరుకున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి రావడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులవారి మల్లేశం గౌడ్, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం, రాంపూర్ సర్పంచ్ నెల్లి రాజు, వరిగుంతం మాజీ ఎంపీటీసీ తుడుం రామకృష్ణయ్య, రంగంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణ, బండి రమేష్, కొమ్ముల రవీందర్ గౌడ్, యేసు రాజు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల త్రిపుర సుందరి రూపంలో దర్శనమిచ్చిన దుర్గామాత

## భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,కుంకుమార్చన





శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 11:

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో గ్రామ పురోహితులు చందు పంతులు,భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భవాని మాలధారణ,దీక్ష స్వీకరణ కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాతను బాలా త్రిపుర సుందరీ దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు,కుంకుమార్చన నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు.అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు,శాంతి,సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని,ప్రతి కుటుంబంలో ఆనందం,ఐశ్వర్యం,కొత్త వెలుగులు నిండాలని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తి,శక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాతను ప్రతిరోజూ ఒక్కో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమివ్వడం విశేషమని పేర్కొన్నారు.నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు గ్రామంలో భక్తిభావాన్ని, ఐక్యతను చాటుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు,భవాని ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కారు ఢీ కొని పల్టీ కొట్టిన ఆటో ఎనిమిది మందికి స్వల్ప గాయాలు

కొండాపూర్ ప్రజా జ్యోతి

నిజాంపూర్ నుంచి సదాశివపేట మీదుగా ఏడుపాయలకు వెళుతున్న ఆటోను గుర్తుతెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి.ఆదివారం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీ కాలభైరవ నర్సరీ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టినట్లు సమాచారం.ఈ ఘటనపై ఆటోలో ప్రయాణిస్తున్న తొంట దేవరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అజాగ్రత్తగా, అతివేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు.



# తెల్లాపూర్ భూసేకరణ నోటిఫికేషన్ కొట్టేసిన హైకోర్టు

రామచంద్రాపురం:

టౌన్‌షిప్ ఏర్పాటు, భవిష్యత్ ప్రాజెక్టుల అభివృద్ధి పేరిట తెల్లాపూర్‌లో చేపట్టిన భూసేకరణ ప్రక్రియను హైకోర్టు రద్దు చేసింది. ఏ అవసరాల కోసం భూమిని సేకరిస్తున్నారనే అంశంపై నోటిఫికేషన్‌లో కనీస స్పష్టత ఇవ్వకుండా జారీ చేసిన నోటిఫికేషన్ చెల్లదని స్పష్టం చేసింది. మెదక్ జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ పరిధిలోని 92.39 ఎకరాల భూసేకరణకు సంబంధించి 2006లో జారీ చేసిన నోటిఫికేషన్, 2007 డిక్లరేషన్‌ను రద్దు చేస్తూ జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ఇటీవల తీర్పు వెలువరించారు.గతంలో ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సేకరించిన భూమిలో ఎక్స్‌ప్రెస్ హైవే కోసం ప్రభుత్వం కొంత భూమిని తీసుకోగా, మిగిలిన జీ–బ్లాక్ భూమిలో 594 మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే, ఆ తర్వాత ప్రతిపాదిత టౌన్‌షిప్ కోసం అప్పటి హుడా (ఎఖణూా) ఈ భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై తెల్లాపూర్ 'జీ' బ్లాక్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ తో పాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు.ఈ భూసేకరణ నోటిఫికేషన్‌లో తీవ్ర చట్టవిరుద్ధాలు ఉన్నాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. టౌన్‌షిప్ అంటూ అస్పష్టంగా చెప్పడం వల్ల భూ యజమానులు తమ అభ్యంతరాలను సరిగ్గా చెప్పుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. భూసేకరణ చట్టంలోని సెక్షన్ 5–ఎ కింద విచారణను కేవలం నామమాత్రంగా ముగించారని తప్పుబట్టారు. భూమి పూర్వాపరాలను పరిశీలించకుండా, సరైన కారణాలు చూపకుండా యజమానుల అభ్యంతరాలను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేశారు. అభ్యంతరాలను కేవలం స్వీకరించి, పరిష్కరించినట్లు చూపిస్తే సరిపోదని, అవసరమైతే తదుపరి విచారణ జరిపి తగిన కారణాలతో నిర్ణయం వెలువరించాలని స్పష్టం చేశారు.ఒకే నోటిఫికేషన్‌లో లోపాలు ఉన్నప్పుడు కొంత మందికి ఒకలా, మిగిలిన భూ యజమానులకు మరోలా భిన్నమైన నిర్ణయాలు తీసుకోలేమని కోర్టు తేల్చిచెప్పింది. అందుకే తెల్లాపూర్‌లోని సర్వే నంబర్లు 333, 334, 335, 341, 342, 343, 363, 364, 368 లలోని మొత్తం 92.39 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నామని, ఒకవేళ ప్రభుత్వానికి నిజంగా అవసరమైతే చట్ట నిబంధనల ప్రకారం తిరిగి మొదటి నుంచి భూసేకరణ ప్రక్రియ చేపట్టవచ్చని తీర్పులో పేర్కొన్నారు.

# బాల త్రిపుర సుందరి రూపంలో దర్శనమిచ్చిన దుర్గామాత

## భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,కుంకుమార్చన



శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 11:

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల కొత్తపేటలో గ్రామ పురోహితులు, వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి తో పాటు భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భవాని మాలధారణ,దీక్ష స్వీకరణ కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గా మాతను బాలా త్రిపుర సుందరీ దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ సంద ర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, శాంతి,సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని,ప్రతి కుటుంబంలో ఆనందం,ఐశ్వర్యం,కొత్త వెలుగులు నిండాలని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తి,శక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాతను ప్రతిరోజూ ఒక్కో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమివ్వడం విశేషమని పేర్కొన్నారు.నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు గ్రామంలో భక్తిభావాన్ని, ఐక్యతను చాటుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమకాంత్ రెడ్డి,స్థానిక సర్పంచ్ రాములు,ఉప సర్పంచ్ సారా చంద్రశేఖర్ గౌడ్,గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు,భవాని ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వరిగుంతం పంచాయతీ నిధుల లెక్కలపై రగడ!

## - సర్పంచ్, కార్యదర్శి పై కాంగ్రెస్ నేతల ఆరోపణలు....
## - ఆవుల రాజిరెడ్డిని కలిసిన గ్రామ కాంగ్రెస్ నాయకులు...
## - నిధుల వినియోగంపై క్షేత్రస్థాయి విచారణకు హామీ...
## - కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదుకు సిద్ధం...



**కొల్చారం, అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)**

మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై వివిధ దినపత్రికలో వచ్చిన కథనాలకు వివాదం కొనసాగుతోంది. గ్రామ సర్పంచ్ పుట్లగళ్ల మోహన్, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై నిధులను ఇష్టానుసారంగా డ్రా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని కలిసి గ్రామంలో పంచాయతీ నిధుల వినియోగంపై నెలకొన్న వివాదాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు అచ్చన్నపల్లి శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నిధుల ఖర్చుపై సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆవుల రాజిరెడ్డిని కోరినట్లు చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తామని, నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని రాజిరెడ్డి తెలిపినట్లు వారు వెల్లడించారు. అలాగే, ఈ వ్యవహారంపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# నైతిక విలువలు, క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన

## - ఇస్లామీయ వర్క్‌షాప్‌లో 107 మంది విద్యార్థుల పాలొగొన్నారు







**కల్హేర్, అక్టోబర్ 11, ప్రజాజ్యోతి:**

విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చే లక్ష్యంతో నారాయణఖేడ్ పట్టణంలోని ఇబ్రహీమియా మసీదులో జమియతే అహ్లె హదీస్ ఆధ్వర్యంలో ఒకరోజు ఇస్లామీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జమియతే అహ్లె హదీస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్ (ఆసిఫ్) మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే నమాజ్ ఆచరించడం, ఖురాన్ పఠనం చేయడం, తల్లిదండ్రులను ప్రేమతో గౌరవించడం, సమాజ సేవలో భాగస్వాములు కావడం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థుల జీవితాల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు .వర్క్‌షాప్‌లో షేక్ హాఫిజ్ కలీమ్ అక్తర్ ఉమ్రీ, షేక్ హాఫిజ్ నిసార్ అహ్మద్ ఉమ్రీ, షేక్ ఆలమ్ ఫైజీ విద్యార్థులకు ఇస్లామీయ బోధనలు, నైతిక విలువలు, మంచి నడవడిక, క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరించారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత, సేవాభావంతో ముందుకు సాగాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడమే వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగిసిన అనంతరం విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ వర్క్‌షాప్‌లో నారాయణఖేడ్‌తో పాటు కిష్టాపూర్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, సిద్దిపేట తదితర ప్రాంతాలకు చెందిన 107 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ హై సూర్తి, జమియతే అహ్లె హదీస్ కార్యదర్శి ముస్లర్, కోశాధికారి మోహిత్‌తో పాటు



అర్షద్, ఫరూక్, ఇమ్రాన్, ఫయాజ్, జమీల్, ఇసాక్, అజ్జు, సజీద్ తదితర బాధ్యులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రత్యేక ఆహ్వానం

## - కల్హేర్ రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం వ్యవసాయ అధికారి కల్హే ర్ శాఖ

**కల్హేర్, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**

కల్హేర్ మండల రైతులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని సోమవారం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 12, సోమవారం ఉదయం 10 గంటలకు కల్హేర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించనున్నారు. మండలంలోని రైతు సోదరులు, గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు. రైతులకు సంబంధించిన అంశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన ముఖ్య విషయాలపై సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సమయానికి రైతు వేదికకు చేరుకుని కార్యక్రమంలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.